

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

వజ్రపుకొత్తూరు : ఉంద్రుకుడియా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బొచ్చ షణ్ముఖరావును కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య సస్పెండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు మండల విద్యాశాఖాధికారి బి.వెంకటరమణ తెలిపారు. విధులకు గైర్హాజరు కావడం, విద్యార్థులకు విద్యా సామర్థ్యం లేకపోవడంపై ఉపాధ్యాయుడు షణ్ముఖరావుపై స్థానికులు రెండు నెలల కిందట అధికారులకు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ డిఇఒ, డిఇఒ ఆకస్మిక తనిఖీల సమయంలోనూ విధులకు గైర్హాజరు కావడంతో ఆయనపై విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. ఆరుగురు విద్యార్థులున్న ఈ పాఠశాలలో విద్యార్థుల తరగతులకు ఇబ్బంది లేకుండా పెద్దబాడాం పాఠశాల నుంచి డెప్యుటేషన్‌పై ఉపాధ్యాయుడిని నియమించినట్లు ఎంఇఒ తెలిపారు.

సచివాలయాలకు కొత్త రూపు



గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థలో కొన్ని మార్పులు చేయాలని ప్రభుత్వం భావించింది. సచివాలయాలను మూడు కేటగిరీలుగా విభజిస్తూ ఈనెల పదో తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. జనాభాకు అనుగుణంగా ఉద్యోగులను సర్దుబాటు చేయాలని నిర్ణయించింది. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు వీలుగా రియల్ టైమ్ పౌర సేవలను అందించేందుకు సిబ్బందికి విధులు కేటాయించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది, కేటగిరీల వారీగా కూర్పు తదితర అంశాలపై అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

- జనాభా ప్రాతిపదికన మూడు కేటగిరీలుగా వర్గీకరణ
- సచివాలయాల సర్దుబాటుకు ఉత్తర్వులు జారీ
- సాధారణ, ప్రత్యేక విధులు నిర్వహించే ఉద్యోగులుగా విభజన
- రేషనలైజేషన్‌పై త్వరలో మార్గదర్శకాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 732 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో గ్రామీణ ప్రాంతాల్లో 657, అర్బన్ ప్రాంతాల్లో 75 సచివాలయాలు ఉన్నాయి. వీటిని 380 క్లస్టర్లుగా విభజించారు. వీటిలో మొత్తం 6,075 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం కొత్తగా వెలువరించిన మార్గదర్శకాల ప్రకారం ఉద్యోగుల నమూనా మారనుంది. జనాభా 2,500 లోపు ఉంటే ఎ-కేటగిరి, 2501 నుంచి 3,500 మంది ఉంటే బి-కేటగిరిగా విభజించారు. 3,501 మంది పైన ఉంటే సి-కేటగిరిగా నిర్ణయించారు. జిల్లాలో ఎ-కేటగిరి పరిధిలో 207, బి-కేటగిరి కింద 282, సి-కేటగిరి కింద 243 సచివాలయాలు తేలాయి. ఎ-కేటగిరిలో ఆరుగురు ఉద్యోగులే ఉంటారు. వీరిలో ఇద్దరు సాధారణ అవసరాల విధుల కోసం, ప్రత్యేక అవసరాల విధుల కోసం నలుగురు ఉంటారు. బి-కేటగిరిలో ఏడుగురు ఉద్యోగులు ఉంటారు. వీరిలో సాధారణ విధుల కోసం ముగ్గురు, ప్రత్యేక విధుల కోసం నలుగురు ఉంటారు. సి-కేటగిరిలో ఎనిమిది మంది ఉంటారు. వీరిలో సాధారణ, ప్రత్యేక విధుల కోసం నలుగురేసి చొప్పున ఉంటారు.

సాధారణ, ప్రత్యేక విధుల కోసం ఉద్యోగుల విభజన

గ్రామ సచివాలయాల్లో సాధారణ విధుల కోసం పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, మహిళా పోలీసు ఉంటారు. వార్డు సచివాలయంలో వార్డు అడ్మిన్‌స్ట్రేటివ్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, మహిళా పోలీసు ఉంటారు. గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక విధుల కోసం గ్రామ రెవెన్యూ అధికారి, ఎఎన్ఎం, సర్వే, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, అగ్రికల్చర్ గానీ ఉద్యాన గానీ పట్టుపురుగుల పెంపకం అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్ ఉంటారు. వార్డు సచివాలయంలో వార్డు రెవెన్యూ కార్యదర్శి, వార్డు హెల్త్ సెక్రటరీ, వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రటరీ, ఎమినిటీస్ సెక్రటరీ, వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ ఉంటారు.

ఎ-కేటగిరిలో ఎవరుంటారు..?

ఎ-కేటగిరి పరిధిలోకి వచ్చే గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి గానీ డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ గానీ మహిళా పోలీసు ఉంటారు. వార్డు సచివాలయంలో వార్డు అడిన్మిస్ట్రేటివ్ కార్యదర్శి, లేదా వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రోసెసింగ్ సెక్రటరీతో పాటు వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ లేదా మహిళా పోలీసు ఉంటారు. బి-కేటగిరి గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ లేదా మహిళా పోలీసు ఉంటారు. వార్డు సచివాలయంలో వార్డు అడ్మిన్‌స్ట్రేటివ్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ లేదా మహిళా పోలీసు ఉంటారు. సి-కేటగిరి పరిధిలోని గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, మహిళా పోలీసు ఉంటారు. వార్డు సచివాలయంలో వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ, మహిళా పోలీసు ఉంటారు.

రేషనలైజేషన్‌పై త్వరలో మార్గదర్శకాలు

గ్రామ సచివాలయాల్లో 11 మంది, అర్బన్‌లో పది మంది ఉద్యోగులు పలు కేడర్లలో పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీసులను ఉంచనున్నారు. అర్బన్ ప్రాంతాల్లో అడ్మిన్ కార్యదర్శితో పాటు నలుగురే ఉంటారని తెలుస్తోంది. ఇప్పటివరకు వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న పరిపాలన, సంక్షేమం, మహిళా కార్యదర్శి, గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శి, విద్యా సంక్షేమం, మహిళా సంరక్షణ కార్యదర్శి కేడర్లపై ప్రభావం చూపనుంది. దీంతో ఉద్యోగుల మిగులు సంఖ్య తేలనుంది. వీరిని ప్రభుత్వ శాఖల్లో విలీనం చేస్తారా? లేదా? అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఉద్యోగుల రేషనలైజేషన్ అంశంపై త్వరలోనే మార్గదర్శకాలు జారీ కానున్నాయని తెలిసింది.

జిల్లా కేంద్ర రూపురేఖలు మారుస్తా

- జిల్లాలో ఐఎఎస్, ఐపిఎస్ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు కృషి
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - గుజరాతీపేట

జిల్లా కేంద్ర రూపురేఖలు మారుస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా పొన్నాడ బ్రిడ్జి వద్ద పూలే విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. మంత్రితో పాటు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే సభ్యులు గొండు శంకర్, బిసి సంఘం నాయకులు నివాళ్లర్పించారు. అనంతరం వాంబే కాలనీ వద్ద రూ.ఐదు కోట్లతో నిర్మించిన బిసి సంక్షేమ భవన సముదాయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పూలే ఆశయాలను కొనసాగించి ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రతి శాఖకు సంబంధించి శాశ్వత, ప్రజలకు ఉపయుక్తమైన పనులు చేపట్టినట్లు తెలిపారు. తాను బిసి సంక్షేమశాఖ మంత్రిగా ఉన్నప్పుడే బిసి సంక్షేమ భవనాలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఇదే భవన సముదాయంలో పైన రెండు గదులు ఏర్పాటు చేసి ఐఎఎస్, ఐపిఎస్ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు సంబంధిత మంత్రితో మాట్లాడుతానన్నారు. పక్కనే ఖాళీగా ఉన్న స్థలంలో ఓపెన్ ఆడిటోరియం ఏర్పాటు చేస్తే, పేద బిసిలు వివాహాలకు ఉపయోగపడుతుందన్నారు. నిర్వహణను అవుట్‌సోర్సింగ్‌కు ఇవ్వాలని కలెక్టర్‌కు సూచించారు.

బిసిల కోసం అమలు చేసే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మార్కెట్‌ను సమూల మార్పులు చేస్తామని, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని అధునాతన సౌకర్యాలతో నిర్మిస్తామన్నారు. పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించేందుకు సహకరించాలని కోరారు. అనంతరం బిసి స్వయం ఉపాధి పథకం కింద 458 మంది లబ్ధిదారులకు రూ.8.50 కోట్ల చెక్కును మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణమూర్తి నాయుడు, బిసి, ఎస్‌సి, మైనార్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డిఎంహెచ్ఒగా అనిత బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



కలెక్టర్‌ను కలిసిన డిఎంహెచ్ఒ అనిత

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిగా నియమితులైన డాక్టర్ కె.అనిత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె ప్రస్తుతం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సిఎస్ ఆర్ఎంఒ (సివిల్ సర్జన్ రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్)గా పనిచేస్తున్నారు. ఆమెను డిఎంహెచ్ఒగా నియమిస్తూ ఈనెల పదో తేదీన ప్రభుత్వం ఉత్వరులు జారీ చేసింది. విశాఖపట్నంలోని రీజనల్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న బి.సుజాతను డిఎంహెచ్ఒగా నియమిస్తూ ఈనెల తొమ్మిదో తేదీన ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తన పిల్లలకు ఆరోగ్యం బాగాలేదనే కారణంతో శ్రీకాకుళం డిఎంహెచ్ఒగా వెళ్లలేనని వైద్యారోగ్యశాఖ కమిషనర్‌కు విన్నవించుకోవడంతో ఆమె బదిలీని ఉన్నతాధికారులు రద్దు చేశారు. ఆమె స్థానంలో అనితను ప్రభుత్వం నియమించింది. ఆమె అంతకుముందు కాకినాడ డిప్యూటీ సిఎస్ ఆర్ఎంఒగా పనిచేశారు. కాకినాడ జిల్లా మలేరియా అధికారిగా పనిచేయడంతో పాటు వైద్యారోగ్యశాఖలో పలు హోదాల్లో పనిచేశారు.

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే పల్లె నిద్ర

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - గార

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు పల్లె నిద్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. పల్లె నిద్రలో భాగంగా మండలంలోని బందరువానిపేటలో శుక్రవారం బస చేశారు. సాయంత్రం నుంచి గ్రామంలోని అన్ని వీధుల్లో పర్యటిస్తూ పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. తాగునీటి సమస్య ఉందని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య మెరుగుకు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సకాలంలో కాలువల్లో పూడికలు తొలగించాలని చెప్పారు. వ్యాధులు ప్రబలకుండా దోమల మందును పిచికారీ చేయాలన్నారు. ముఖ్యంగా మురుగునీరు రోడ్లపై ప్రవహించకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దమొత్తంలో నిధులు కేటాయిస్తోందని తెలిపారు.



బందరువానిపేటలో పల్లె నిద్ర చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

న్యాయ వ్యవస్థపై అవగాహన అవసరం

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

న్యాయ వ్యవస్థపై అవగాహన అవసరమని జిల్లా జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. న్యాయ సేవా సదన్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. న్యాయ విద్యార్థులకు కోర్టులో జరిగే కార్యకలాపాలను వివరించి, అవసరమైన చట్టాలపై సమగ్ర అవగాహన కల్పించారు. న్యాయ వ్యవస్థను సమర్థవంతంగా అర్థం చేసుకోవాలంటే విద్యార్థులు కోర్టు ప్రక్రియలను దగ్గర నుంచి గమనించాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండడం సామాజికంగా ప్రయోజనకరమన్నారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.సువర్ణరాజు, న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ఎంపిఆర్ లా కళాశాల ప్రిన్సిపాల్, న్యాయ విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

తవ్వేసి... తమాషా చూస్తున్నారు

ప్రజాశక్తి- కవిటి



మెటల్ వేసి వదిలేసిన రోడ్డు

రాష్ట్ర వ్యాప్తంగా గుంతల రహదారులు పునర్నిర్మించి, వాహనదారులకు సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం గుత్తేదారుల నిర్లక్ష్యంతో నీరుగారుతోంది. దానికి ప్రత్యక్ష ఉదాహరణ శిలగాం - జగతి ఆర్ అండ్ బి రహదారి. గత కొద్ది నెలల కిందట శిలగాం - జగతి రహదారి గుంతలు పూడ్చే క్రమంలో రహదారి తవ్వేశారు. ఆ తరువాత తూతూ మాత్రంగా మెటల్ వేసిన గుత్తేదారులు ప్రస్తుతం చోద్యం చూస్తున్నారు. దీంతో ఈ రహదారిలో ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవడమే కాకుండా ఇటీవల వాహన ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అయినా గుత్తేదారులు చలించడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. గతంలో కొంత బాగున్న రహదారిలో వెళ్లేవారిమని, ఇపుడు అది కూడా లేకుండా తవ్వేశారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ రహదారికి కొత్త రూపురేఖలు వస్తాయని అనుకుంటే, మొదటికే మోసం జరిగిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బి అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తక్షణమే శిలగాం - జగతి రహదారికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



అద్దెకు యంత్ర పరికరాలు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్, కోటబొమ్మాళి, రణస్థలం రూరల్

రైతు సేవా కేంద్రాల పరిధిలోని కమ్యూనిటీ హైరింగ్ కేంద్రాల్లో వ్యవసాయ యంత్ర పరికరాలను అద్దె ప్రాతిపదికన రైతులు వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.త్రినాథస్వామి అన్నారు. టెక్కలి, కోటబొమ్మాళి, రణస్థలం మండలాల్లోని పలు రైతు సేవా కేంద్రాల్లో కమ్యూనిటీ హైరింగ్ కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో అద్దెకు కావాల్సిన పరికరాల వివరాలను నమోదు చేసుకుంటే, వాటిని రైతులకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వేసవి దుక్కుల నేపథ్యంలో ఈ యంత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎడిఎ బి.వి తిరుమలరావు, భవానీ శంకర్, వ్యవసాయ అధికారి జి.రంగారావు, ఎస్.గోవిందరావు, విజయ్ భాస్కర్, మాజీ ఎంపిపి టి.రామకృష్ణ, విఎఎ ఎం.మాధవి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం సరఫరా చేయాలి

ప్రజాశక్తి - గుజరాతీపేట



ఆస్పత్రిలో రోగులకు నాణ్యమైన ఆహారం సరఫరా చేయాలని జిల్లా ఫుడ్ కంట్రోల్ అధికారి కె.వెంకటరత్నం చెప్పారు. కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు సరఫరా చేసే ఆహారాన్ని ఆస్పత్రి డైటీషియన్ సమక్షంలో శుక్రవారం పరిశీలించారు. ఆహారం సరఫరా చేసేందుకు లైసెన్స్ లేదని లైసెన్స్ పొందాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆహారం తయారు చేసే ప్రాంతంలో పరిశుభ్రంగా ఉండాలని స్పష్టం చేశారు. సూచించిన సూచనలు సరిచేసుకోవాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆరోగ్యం బాగాలేక ఆస్పత్రికి వచ్చే వారికి నాణ్యత లేని ఆహారం సరఫరా చేస్తే వారి ఆరోగ్యం ఇంకా క్షీణిస్తుందని వివరించారు. ఆహారం నాణ్యత పెంచాలని నోటీసు జారీ చేశారు. పరిశీలనలో ఫుడ్ సేఫ్టీ అధికారి లక్ష్మి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన అంబేద్కర్ విగ్రహ పనులు

శ్రీకాకుళం : నగరంలోని అంబేద్కర్ కూడలిలో రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ కాంస్య విగ్రహ ఏర్పాటు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. అంబేద్కర్ జంక్షన్‌లో కాంస్య విగ్రహ ఏర్పాటు పనులను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్‌డిఒ సాయి ప్రత్యూషతో కలిసి శుక్రవారం పరిశీలించారు. జంక్షన్ మధ్యలో ఉండే వైర్లు, స్తంభాలను తొలగించాలని ఆదేశించారు. ఈనెల 13వ తేదీ నాటికి పనులన్నీ పూర్తి కావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ఎంఇ, హెల్త్ ఆఫీసర్, దళిత సంఘాల నాయకులు కంఠ వేణు, రమణ మాదిగ, తైక్వాండో శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందిదే గరిష్ట కూలి బాధ్యత

డ్వామా పీడీ సుధాకరరావు

ప్రజాశక్తి - పొందూరు



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ సుధాకరరావు

ఉపాధి కూలీలకు గరిష్ట కూలి అందేలా చూడాల్సిన బాధ్యత ఉపాధి హామీ సిబ్బందిదేనని డ్వామా పీడీ పి.సుధాకరరావు అన్నారు. మండలంలో ఉపాధి పనులకు కూలీలు తక్కువగా హాజరు కావడంపై ఉపాధి హామీ సిబ్బందితో శుక్రవారం ఉపాధి హామీ కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గతేడాది జిల్లాతో పాటు మండలంలోనూ గరిష్ట కూలి రూ.249 కూలీలకు అందేదని, ప్రస్తుతం మండలంలో రూ.289 కూలిగా అందుకుంటున్నారని తెలిపారు. గరిష్ట కూలి రూ.307 అందేలా కూలీలతో పనులు చేయించాలన్నారు. వేసవి అలవెన్సులు లేవని, పనుల వద్ద సౌకర్యాలు ఉపాధి కూలీలే కల్పించుకోవాలన్నారు. ఈ సందర్భంగా పీడీ పలు రికార్డులను పరిశీలించారు. సమావేశంలో ఎంపిడిఒ మన్మథరావు, ఎపిఒ శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇసిలు, సిబ్బంది పాల్గొన్నారు.

15 నుంచి చేపల వేట నిషేధం

ప్రజాశక్తి - శ్రీకాకుళం



సముద్ర జలాల్లో ఈనెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు మెకనైజ్డ్, మోటారు బోట్ల ద్వారా చేపల వేటను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు వై.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. సముద్ర జలాల్లో చేప, రొయ్యల జాతులు సంతానోత్పత్తి కాలంలో వాటిని సంరక్షించడం, సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం ద్వారా మత్స్య సంపద సుస్థిరతను సాధించేందుకు చేపల వేట నిషేధాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించి చేపల వేట చేసే బోట్ల యజమానులు శిక్షార్హులని స్పష్టం చేశారు. ఆ బోట్లను, బోట్లలో ఉండే మత్స్య సంపదను స్వాధీనం చేసుకోవడమే కాకుండా జరిమానా విధించనున్నట్లు తెలిపారు. డీజిల్ రాయితీ, ప్రభుత్వం అందించే అన్ని రకాల రాయితీ సౌకర్యాలను నిలుపుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. నిషేధ కాలాన్ని కచ్చితంగా అమలు చేసేందుకు మత్స్యశాఖ, కోస్టుగార్డు, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ, రెవెన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం

రేఖా సంఖ్య.176/2025/G1. **పత్రికా ప్రకటన** తేది.11.04.2025

గౌరవ డైరెక్టర్ & పట్టణ ప్రణాళికా సంచాలకులు, మంగళగిరి వారి సర్క్యులర్ Bo, Lr.Roc. No. 17/08/2022-PLG, DO TCP Dt.13-08-2024 మరియు శ్రీయుత ప్రాంతీయ ఉప సంచాలకులు, టౌన్ & కంట్రీ ప్లానింగ్ వారి ద్వారా Lr. Roc No 349/2020/V2,Dt. 14-08-2024 వారి సర్క్యులర్ ను అనుసరించి, శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో గల వీధులలో రహదారుల వెడల్పు తక్కువగా ఉండే జనసాంద్రత మరియు నిర్మాణముల సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతములలో భవన నిర్మాణ అనుమతులు పొందుటకు గాను సంబంధిత భవన నిర్మాణ యజమానులకు కష్టతరముగా ఉన్నదని, ఇందుపై శ్రీయుత సంచాలకులు, టౌన్ & కంట్రీ ప్లానింగ్ వారి యొక్క ఉత్తర్వులను అనుసరించి ఇందుపై సంబంధిత ప్రాంతములకు (ఏరియాలకు) సర్క్యులేషన్ నెట్వర్క్ ప్లానులు తయారుచేసి ఆమోదము పొందిన యెడల ప్లానులకు అనుమతులు ఇచ్చుటకు వీలు అగునని తెలిపియున్నారని, అందువలన సర్క్యులేషన్ నెట్వర్క్ ప్లానులు తయారుచేయించి (Competent Authority, RDDTP) వారి వద్ద అమోదము పొందిన యెడల పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో భవన యజమానులకు భవన నిర్మాణ అనుమతులను పొందు విషయమై వెసులుబాటు కలుగుతుంది.

ప్రస్తుతము పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో చాలా ప్రాంతాలు చిన్నదారులు మరియు పాత నిర్మిత ప్రాంతాలలో 9మీ (30 అడుగుల) కంటే తక్కువ వెడల్పు గల రోడ్లుతో కూడుకుని ఉన్నాయి. సదరు స్థలములో భవనము ఎత్తు 10మీ (G+2 Floor) మించకుండా ఉండునట్లు మరియు మాస్టర్ ప్లాన్, రహదారి తప్ప మిగిలిన చిన్న రహదారులను వాటి ప్రస్తుత రోడ్డు వెడల్పులను 30 అడుగులు కన్నా తక్కువ వుంటాయి. అటువంటి భవనములకు/ స్థలాలకు నూతన భవన నిబంధనల మేరకు 30 అడుగుల వరకు రోడ్డు భాగమును సంబంధిత పురపాలక సంఘం అనగా ఈ పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘమునకు ఉచితముగా అందజేయవలసి ఉండేది. ప్రస్తుతము అందుకు ఉపశమనం కోసమై ఈ పురపాలక సంఘం పరిధిలో 129 ప్రాంతాలలో కూడిన 28 సంఖ్యలు గల సర్క్యులేషన్ నెట్వర్క్ ప్లానులు GIS సాఫ్ట్వేర్ నందు తయారుచేయడం జరిగినది.

కావున పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో గల పట్టణ ప్రణాళికా విభాగము వారు సర్వే చేసి గుర్తించి తయారు చేసిన ప్రతిపాదనలు గౌరవ ప్రాంతీయ ఉప సంచాలకులు, టౌన్ & కంట్రీ ప్లానింగ్ అధికారి, విశాఖపట్నం వారిచే ఆమోదము పొందిన 129 ప్రాంతాలతో కూడిన 28 సంఖ్యలు గల సర్క్యులేషన్ నెట్వర్క్ ప్లానులు ఈ కార్యాలయము నందు మరియు సంబంధిత సచివాలయ కార్యాలయాలలో నోటీసు బోర్డు నందు అందుబాటులో ఉంచడమైనది. దీనిపై ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల 7 రోజులలో మీ యొక్క అభ్యంతరములు ఈ పురపాలక సంఘము కార్యాలయమునకు లిఖిత పూర్వకముగా తెలియజేయవలసినదిగా కోరుచున్నాము.

సం/- కమిషనర్,పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం


శంకుస్థాపన చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

గ్రామాల అభివృద్ధికి బాటలు

ప్రజాశక్తి - టెక్కలి, నందిగాం, నౌపడ

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి మండలాల్లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉన్నా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఆర్‌డిఒలు కృష్ణమూర్తి, కె.వెంకటేష్, ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ జాన్ సుధాకర్, టెక్కలి ఇఇ పి.సత్యనారాయణ, డిఇ రవికాంత్, ఎఇ జగదీష్, పంచాయతీరాజ్ డిఇ సుధాకర్, టిడిపి నాయకులు పి.అజయ్ కుమార్, ఎం.బాలకృష్ణ, పి.చంద్రశేఖరరావు, జనసేన పార్టీ టెక్కలి ఇన్‌ఛార్జ్ కణితి కిరణ్, మండల టిడిపి అధ్యక్షులు జీరు భీమారావు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు అట్టాడ రామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారంపై శ్రద్ధ

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - పలాస

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశీబుగ్గ పరిసర ప్రాంతాల ప్రజలు వారి సమస్యలు తెలిపేందుకు సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రంగా పోలీసు కార్యాలయానికి రావడం ఇబ్బందిగా ఉంటుందని, వ్యయప్రయాసలు, ఖర్చుతో పని లేకుండా అంతమందికి అందుబాటులో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నామని చెప్పారు. ప్రజా ఫిర్యాదులు స్వీకరణ కార్యక్రమంలో 12 వినతలు వచ్చాయని చెప్పారు. ఆయా ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఎస్‌పి అధికారులను ఆదేశించారు. తక్షణమే ఆయా ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులకు తెలిపి చట్ట ప్రకారం విచారణ జరిపి త్వరితగతిన పరిష్కారం అందించాలని ఆదేశించారు.


రశీదులు ప్రదర్శిస్తున్న కమిషనర్ తదితరులు

మున్సిపాలిటీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - పలాస

మున్సిపాలిటీ ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఆదాయం వచ్చే ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి మున్సిపల్ కమిషనర్ల వర్క్‌షాప్‌లో రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి నారాయణ, ప్రిన్సిపల్ కార్యదర్శి సూచన మేరకు శుక్రవారం పలాస మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలను చేసుకోవాలని, అదే రకంగా టాక్స్ కలెక్షన్స్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ వీటన్నిటిని కూడా పరిగణలోకి తీసుకొని ప్రణాళికను రచించుకోవాలని సూచించారని చెప్పారు. శాఖల వారిగా ఆదాయాలను పెంచుకోవాలని, అదేవిధంగా పెండింగ్ ఉన్న అన్ని సర్వేలను పూర్తి చేయాలని చెప్పారు. మున్సిపాలిటీలో ప్రాథమికంగా అవసరాలైన శానిటేషన్, వాటర్ సప్లై, లైటింగ్, రోడ్స్ రిపేర్, కొత్త కాలువల నిర్మాణం కొరకు ప్రణాళికలను రచించి మున్సిపాలిటీ అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో కార్యాలయ మేనేజర్ ప్రభాకరరావు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది ప్రేమ్, టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న భారతి సౌజన్య

పారిశుధ్య పనులు ఆకస్మిక తనిఖీ

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీలో జరుగుతున్న పారిశుధ్య పనులను జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రజాశక్తిలో కంపు కొడుతున్న టెక్కలి అనే శీర్షిక ప్రజాశక్తిలో ప్రచురితం కావడంతో స్పందించిన ఆమె పారిశుధ్య పనులను పరిశీలించారు. పంచాయతీలో చెత్త ఎక్కడా కనిపించకూడదని కార్యదర్శికి అదేశించారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపిసి షెడ్‌ను పరిశీలించారు. షెడ్ నిర్వహణ రికార్డును తనిఖీలు చేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి గోపిబాల, ఇన్‌ఛార్జి కార్యదర్శి శశి, సిబ్బంది పాల్గొన్నారు.

తొమ్మిది మందిపై బైండోవర్ కేసులు

పలాస: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తొమ్మిది మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు కాశీబుగ్గ ఎక్సైజ్ సిఐ మల్లిఖార్జునరావు తెలిపారు. తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి సమక్షంలో బైండోవర్ కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. నాటుసారా విక్రయాలు, తయారీ చేయడం వంటివి జరగకుండా ముందస్తుగా బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ షేక్ సైదాబి తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మెళియాపుట్టి, చాపర గ్రామ బెల్లం వ్యాపారస్తులపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ బడే పాపారావు, టెక్కలి ఎక్సైజ్ సిఐ షేక్ మీరా సాహెబ్, సీనియర్ అసిస్టెంట్ జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువాలు వితరణ

ఇచ్ఛాపురం: మండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రెడ్డిక సంఘం, బెహరా సంఘం సంయుక్తంగా రూ. 35 వేలు విలువ చేసే మూడు బీరువాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పిట్ట మామయ్య, ఎంపిటిసి తరిణి బెహరా, ఎస్‌ఎంసి చైర్మన్ మాయావతి బెహరా, గ్రామపెద్దలు పి.భీమారావు, చంద్రశేఖర్, వెంకటేష్, అనిల్, ఘనశ్యాం, హెచ్‌ఎం జాడు ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బీరువాలు వితరణగా అందజేస్తున్న గ్రామస్తులు

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే


మెళియాపుట్టి : నివాళ్లర్పిస్తున్న తహశీల్దార్ పాపారావు


ఆమదాలవలస : నివాళ్లర్పిస్తున్న కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు

ప్రజాశక్తి - గుజరాతీపేట

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసి, పనిచేసిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి పురస్కరించుకొని శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సామాజిక సంస్కరణ ఉద్యమంలో పూలే ఒక ముఖ్యమైన వ్యక్తిగా నిలిచి, ఆయన స్థాపించిన సత్య శోధక సమాజాం దేశంలోనే ఇది మొట్టమొదటి సంస్కరణోద్యమంగా పేరుగాంచి కుల, మత, వర్ణ విబేధాలకు స్వస్తి పలికారని, నాటి కాలంలో విద్యా వ్యవస్థకు పెద్దపీట వేసి పూలే ఆయన భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి భారతదేశంలో మహిళలకు, తక్కువ కుల ప్రజలకు విద్యను అందించే ప్రయత్నాలకు ప్రసిద్ధి చెందారన్నారు. పూలే జీవిత చరిత్రను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ డిఎస్‌పి శేషాద్రి, ఆర్ఐ కె.నర్సింగరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టి: జ్యోతిరావు పూలే ఒక భారతీయ సామాజిక కార్యకర్త, వ్యాపారవేత్త, కుల వ్యతిరేక సామాజిక సంస్కర్త అని తహశీల్దార్ బడే పాపారావు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రాము, సీనియర్ అసిస్టెంట్ జగన్ మోహనరావు, రంజిత్ కుమార్, వీఆర్‌ఒలు, వీఆర్‌ఎలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పూలే జయంతి సందర్భంగా రాష్ట్ర తూర్పు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నరసన్నపేట: స్థానిక టిడిపి కార్యాలయంలో మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా మహాత్మా జ్యోతిరావు పూలే చిత్ర పటానికి, ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడు చిత్ర పటాలకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఆధ్వర్యంలో పూలే జయంతి సందర్భంగా కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ సతీష్ కుమార్, అధ్యాపకులు రామారావు, లోక్‌పాల్ తదితరులు పాల్గొన్నారు. బిజెపి మండల అధ్యక్షులు రాంజీ ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో నడుపురు లక్ష్మీనారాయణ, జర్నీ పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక బాలికోన్నత వసతి గృహంలో సమతా సైనిక దళ్ జిల్లా కార్యదర్శి చల్ల రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మహాత్మా జ్యోతిరావు పూలే ఆదర్శప్రాయుడని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఆయన జయంతి సందర్భంగా రామతీర్థం జంక్షన్‌లో ఉన్న పూలే విగ్రహానికి కూటమి నాయకులతో కలిసి పాలాభిషేకం చేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు, ముప్పిడి సురేష్, పిసిని జగన్నాథం నాయుడు, పిన్నింటి బాంజీ నాయుడు, లంక ప్రభాకరరావు, బెండు మల్లేశ్వరరావు, రౌతు శ్రీనివాసరావు, వద్దాది శ్రీనివాసరావు, పైడి అప్పుడురావు, మండపాక కనకరావు, ముఖ్య, ఆడినారాయణ, మహంతి అనంత్, దన్నాన సత్తిబాబు, గొర్లె శ్రీనివాసరావు, మాడుగుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: భారత జాతికి జ్యోతిరావుపూలే సేవలు ఆదర్శంగా నిలిచాయని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు అన్నారు. ఎంపిపి చాంబర్‌లో జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు సంపతిరావు హేమసుందరరావు, వైసిపి నాయకులు అన్నెపు రామారావు, పేడాడ వెంకటరావు, హనుమంతు గోవింద్, సింగుపురం వినోద్, పంట రాము, తర్ర రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండలంలోని బెలమాంలో కుల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్కా కృష్ణయ్య, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు రాకోటి రాంబాబు, అంబేద్కర్ చైర్ సాధన సమితి కన్వీనర్ పాల్గొన్నారు.


గుజరాతీపేట : జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ఎస్‌పి


కోటబొమ్మాళి : పూలే చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

అలాగే పట్టణంలోని టిడిపి కార్యాలయంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నారాయణపురం ఆనకట్టు చైర్మన్ సనపల ఢిల్లేశ్వరరావు, తమ్మినేని శ్రీనివాసరావు, పివివికె రాజు, గోవింద, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

లావేరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన జీవిత చరిత్రపై రాసిన వ్యాసరచన పోటీలో పి.రఘుకృష్ణకు ప్రథమ బహుమతిని గ్రంథాలయం తరుపున అందించారు. కార్యక్రమములో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని కర్లమ్మ పంచాయతీ నేతాజీ నగర్ కాలనీలో దళిత మహాసభ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో దళిత మహాసభ గౌరవ సభ్యులు జమ్మయ్య, గుమ్మయ్య, దళిత మహాసభ అధ్యక్షులు టొంపల తిరుపతి, కార్యదర్శి పడాల నాగభూషణం, కోశాదికారి బొడ్డేపల్లి రామకృష్ణ, విశ్రాంత ఎంఇఒ బొడ్డేపల్లి శ్రీను, విశ్రాంత ఉపాధ్యాయులు సల్ల మన్మథ, మహేంద్ర, ఎండునాయుడు, పోలయ్య, సూరిబాబు, శివ పాల్గొన్నారు.

రైతాంగ వ్యతిరేక విధానాలపై పోరాటాలు


వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న బాలాజీరావు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

అఖిల భారత కిసాన్ సభ 90వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా చిలకపాలెంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జెండాను సీనియర్ నాయకులు తోనంగి నందివాడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.చంద్రరావు, కె.మోహనరావు మాట్లాడుతూ బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా, ఫ్యూడల్ జమిందారి విధానానికి వ్యతిరేకంగా జరిగిన రైతాంగ పోరాటంలో భాగంగా 1936లో ఆవిర్భవించిందన్నారు. నేడు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తుందని, భారత ప్రభుత్వం అమెరికన్ సామ్రాజ్యవాదానికి లొంగిపోయి భారత రైతుల ప్రయోజనాలను అమెరికా ఆర్థిక ప్రయోజనాలకు బలి పెడుతుందన్నారు. వ్యవసాయ రంగానికి కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో కోతలు విధిస్తుందని, కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తూ రైతాంగ ప్రయోజనాలను నిరాకరిస్తుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వ అడుగు జాడల్లో నడుస్తుందన్నారు. నారాయణపురం భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. రైతులు పండించిన అన్ని పంటలకు మద్దతు ధరల జాబితాలో చేర్చి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. రైతుల భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ఈ ప్రభుత్వ విధానాలకి వ్యతిరేకంగా రైతులంతా సంఘటితంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో కోరాడ అప్పన్న, కె.రాజేశ్వరి, అప్పలరాజు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: సామాన్య ప్రజానీకాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత రైతు సంఘం మండల అధ్యక్షులు కె.బాలాజీరావు అన్నారు. మండలం బెండి, నగరంపల్లిలో నిర్వహించిన అఖిల భారత కిసాన్ సభ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒకపక్క విద్యుత్ ఛార్జీలు పెంచి మరోపక్క సామాన్యుల వాడుకొనే నిత్య అవసర ధరలు పెంచిందన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన ప్రభుత్వాలు ఇప్పటికైనా పెంచిన ధరలు తగ్గించి సామాన్య ప్రజలకు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నగరంపల్లి, బెండిలో రైతు సంఘాల నాయకులు తమ్మినేని భాస్కరరావు, కె.వెంకటరావు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోనారి హేమ సూదన్, బి.రామకృష్ణ. టి.లక్ష్మి, నీలాచలం, శంకర్, నరేష్, హరి తదితరులు పాల్గొన్నారు.


ఎచ్చెర్ల : జెండా ఎగురవేస్తున్న రైతు సంఘం నాయకులు


మృతి చెందిన అప్పలస్వామి


మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మండలంలో చాపరకు చెందిన మతిస్థిమితం లేని వృద్ధుడు కిక్కర అప్పలస్వామి (70) శవమై ఉలాసపేట సమీపంలోని తోటలో కనిపించాడు. ఈనెల 8 నుంచి కనిపించకుండా పోయి శుక్రవారం ఉలాసపేట సమీపంలో శవమై కనిపించడం స్థానికులు గుర్తించారు. మృతుడు గత మూడురోజుల కిందట ఉలాసపేట తోటలో ఎండ తీవ్రతకు మృతి చెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. మృతుడి భార్య కొన్నేళ్ళ కిందట చనిపోగా కుమారుడు కృష్ణమూర్తి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. మృతి చెందిన అప్పలస్వామికి చాపర గ్రామానికి చెందిన సత్యసాయి కమిటీ సభ్యులు జీవనాధారంగా భోజనాలు అందిస్తున్నారు. మృతి చెందిన సంఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

స్వగ్రామానికి భుజంగరావు మృతదేహం

ప్రజాశక్తి - కవిటి


భుజంగరావు మృతదేహం

మార్చి 6న ఇరాక్‌లో మరణించిన కవిటి మండలం బెలగాంకు చెందిన భుజంగరావు మృత దేహం ఎట్టకేలకు శుక్రవారం సాయంత్రం స్వగ్రామానికి చేరుకుంది. పొట్టకూటి కోసం ఇరాక్‌లోని బాసర ఏరియాలో వున్న కెప్ట్ కంపెనీకి వలసకూలీగా వెళ్లాడు భుజంగరావు. మార్చి 6వ తేదీ గురువారం రాత్రి కంపెనీలో ఒక్కసారిగా గ్యాస్ లీకవ్వడంతో దాన్ని నియంత్రించేందు భుజంగరావు వెళ్లారు. అయితే గ్యాస్ తాకిడికి ఆయన అక్కడికక్కడే స్పృహ కోల్పోయేసరికి తోటి కూలీలు సపర్యలు చేశారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందాడు. ఆరోజు నుంచి భుజంగరావు మృతదేహం కోసం కుటుంబ సభ్యులు ఎదురు చూస్తున్నారు. దీంతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ కృషి ఫలితంగా 36 రోజుల తరువాత మృతదేహం బెలగాం చేరుకుంది. మృతదేహాన్ని చూసిన భుజంగరావు భార్య జయ, పిల్లలు దీక్ష, రిషి కన్నీటి పర్యాంతమయ్యారు. మృతదేహాన్ని స్వగ్రామం తీసుకురావడంలో కృషి చేసిన కేంద్ర మంత్రి, ప్రభుత్వ విప్‌కు కుటుంబ సభ్యులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తికి జైలు శిక్ష

ప్రజాశక్తి - రణస్థలం

2020లో మండలంలోని తెప్పలవలస గ్రామంలో సరిహద్దు రాళ్ల విషయంపై తెప్పలవలసకు చెందిన తొమ్మిది మంది వ్యక్తులు అప్పటి విఆర్ఒ విధులకు ఆటంకపరచి, కులం పేరుతో దూషించారని అప్పటి ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేయగా, అప్పటి శ్రీకాకుళం డిఎస్‌పి ఎం.మహేంద్ర దర్యాప్తు జరపగా అందులో బలగ చిరంజీవి అనే వ్యక్తిపై కోర్టులో నేరం రుజువైనందున చిరంజీవికి రెండేళ్లు జైలుశిక్ష, రూ.11 వేలు జరిమానా విధించినట్లు జెఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి ఒక ప్రకనలో తెలిపారు. మిగిలిన వారిపై కేసు కొట్టివేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసెక్యూటర్ వి.రఘురామ్ వాదించినట్లు పేర్కొన్నారు.

తగ్గుముఖం పట్టిన డయేరియా

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మున్సిపాలిటీలో పురుషోత్తంపురం గ్రామంలో ఉధృతంగా ఉన్న డయారియా వైద్య శిబిరం ఏర్పాటు, పారిశుధ్య పనులు మెరుగు పర్చడంతో తగ్గుముఖం పట్టింది. శుక్రవారం పురుషోత్తం పురంలో వైద్యసేవలు కొనసాగిస్తున్నారు. డాక్టర్ జూహిత పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. నీరు, కలుషిత ఆహారం వలన 10 మంది డయేరియాతో ఇబ్బంది పడ్డారని వైద్య సిబ్బంది తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో డయేరియా అదుపులోకి వచ్చిందన్నారు.


విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


రమణను సత్కరిస్తున్న కృష్ణచైతన్య

రమణకు సత్కారం

ప్రజాశక్తి - పోలాకి

మండలంలో సంతలక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి యారబాటి వెంకట రమణకు వైసిపి నరసన్నపేట నియోజకవర్గ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ వింగ్ అధ్యక్షులుగా కేంద్ర కార్యాలయం ప్రకటించిందని జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య తెలిపారు. శుక్రువారం నరసన్నపేట పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వై.వి. రమణకు దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతను అప్పచెప్పినందుకు సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు. అలాగే మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు, వైసిపి యువజన విభాగం అధ్యక్షుడు ఆర్.త్రినాథరావు, బొద్దాం సర్పంచ్ బెండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పది, ఇంటర్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

ప్రజాశక్తి - రణస్థలం

కొండములగాం ఆదర్శ పాఠశాల పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇంటర్నర్ షిప్ సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు కల్పించినట్లు ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ శుక్రవారం తెలిపారు. విద్యార్థులకు వేసవిలో ఇంటర్నర్ షిప్ కోసం స్థానిక జె.ఆర్.పురం, పైడి భీమవరం సచివాలయాల్లో పదిరోజులు శిక్షణ ఇస్తున్న జె.ఆర్.పురం సచివాలయాన్ని ప్రిన్సిపాల్ శ్రీధర్, ఐటి విభాగం ట్రైనర్ రత్నబాబు పరిశీలించారు. విద్యార్థుల శిక్షణ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.


శిక్షణను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి


పొందూరు : అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ లీలారాణి

ప్రజాశక్తి - కవిటి

అంగన్వాడీ కార్యకర్తలు చిన్నారుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూపర్ వైజర్లు సుజాత, లక్ష్మీ, పల్లవి తెలిపారు. మండల పరిధిలోని 106 అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అందులో భాగంగా సిహెచ్ కాపాసుకుద్ధి, కె.కొజ్జిరియా గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో వీరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశుభ్రత లేకపోవడంతోనే చాలా వ్యాధులు చుట్టుముడుతున్నాయని, దీనిపై దృష్టిసారించి చిన్నారుల తల్లిదండ్రులను అప్రమత్తం చేయాలని కోరారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశాలు, స్థానికులు పాల్గొన్నారు.

పొందూరు: గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూపర్‌వైజర్ కె.లీలారాణి అన్నారు. మండలం లోలుగులో జాతీయ పౌష్టికాహార మహోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలు, గుడ్లుతో పాటు ఆకుకూరలలో మంచి పోషకవిలువలు ఉంటాయన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు బి.జ్యోతిలక్ష్మి, జి.భారతి, శోభారాణి, అంగన్వాడీ సహాయకులు పాల్గొన్నారు.

ఉపాధితో ఆర్థిక పరిపుష్టి

ప్రజాశక్తి - కవిటి

ఉపాధిహామీ పనులతో ఆర్థిక పరిపుష్టి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాళం రమేష్ అన్నారు. కవిటి రాజుగారి చెరువులో శుక్రవారం ఉపాధిహామీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.8.60 లక్షల అంచనాతో ఉపాధిహామీ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. జాబ్ కార్డు ఉండి అవసరమైన ప్రతిఒక్కరూ ఉపాధిహామీ పనులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆరింగి మధు, తమరాల జయరాం, బెందాలం తిరుమల కుమార్, హరి బెహరా, సత్య, దీపక్, కమలలోచన పాల్గొన్నారు.

లావేరు: ఉపాధిహామీ పథకాన్ని జాబ్ కార్డులున్న వేతనదారులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని టిడిపి యువ నాయకుడు మజ్జి రామూర్తి అన్నారు. మండలంలోని గుమ్మడాం పంచాయతీ నాగంపాళెంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా చెరువులో మట్టి పనిని ఆయన ప్రారంభించారు. పని ప్రదేశంలో తాగునీరు ఉంచు కోవాలన్నారు. కార్యక్రమంలో జె.నూకరాజు, రామస్వామి, బంగారు నాయుడు, దుర్గాసి రాంబాబు, సర్పంచ్ ప్రతినిధి దుర్గాసి ధర్మరావు, ఎంపిటిసి తవిటి నాయుడు, కూలీలు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న నాయకులు


ఎంపిడిఒ నీరజతో మాట్లాడుతున్న తేజేశ్వరరావు

అభివృద్ధి పనులకు సహకరించాలి

ప్రజాశక్తి - కొత్తూరు

మండల కేంద్రంలో శుక్రవారం బిజెపి జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు స్థానిక గ్రామ సచివాలయం, తహశీల్దార్, ఎంపిడిఒ, హౌసింగ్, ఉపాధిహామీ కార్యాలయాలను సందర్శించారు. ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు బూరాడ భాస్కరరావు, జిల్లా సెక్రటరీ వలురౌతు ప్రసాద్, జాన్ కటారి, చోడవరపు నరసింహామూర్తి, కాపల దమయంతి, పళ్ల అప్పలరాజు, బృందావతి, సత్య, శ్యామల, తోయక ఆనంద్, ఈశ్వరరావు, అందవరపు వెంకటరమణ, గోపాలకృష్ణ, ఉపేంద్ర, సాయి, భాస్కరరావు, బోగిసాయి తదితరులు పాల్గొన్నారు.

కంకర తవ్వకాలు ఆపాలి

ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి సూదికొండలో గత వారం రోజులుగా అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. ఇదే ప్రాంతంలో గతంలో కొంతమంది గ్రావెల్ తవ్వకాలు చేసి కంకర తరలించిన సమయంలో గ్రామస్తులు, ప్రజాసంఘాలు, పర్యావరణ ప్రేమికులు పెద్దఎత్తున గ్రావెల్ తవ్వకాలను వ్యతిరేకంగా పోరాటం చేసి స్థానిక మున్సిపాలిటీ సహాయంతో కౌన్సిల్ తీర్మానం ఆమోదం చేసి జిల్లా కలెక్టర్‌కు పంపించి గ్రావెల్ తవ్వకాలను నిలుపుదల చేయడం జరిగిందని, ప్రస్తుతం మరలా కంకర తవ్వకాలు జరుపుతున్నాయని తక్షణమే ఆపాలని వైసిపి పట్టణ అధ్యక్షుడు, 19 వార్డు కౌన్సిలర్ ప్రతినిధి శిష్టు గోపి డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో శుక్రవారం ఆర్‌డిఒ జి.వెంకటేష్‌కు గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్రీయ విద్యాలయం నిర్మాణం కోసం అంటూ మరల సూది కొండలో గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారని, సూదికొండ, నెమలికొండ రూపురేఖలు మారిపోతాయన్నారు. సూదికొండలో ఎన్నో రకాల మూగజీవాలు నివసిస్తున్నాయని, తవ్వకాలు ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో జీవ వైవిధ్యం దెబ్బతిని పర్యావరణకు ముప్పు ఏర్పడు తుందన్నారు. కంకర తవ్వకాలు వల్ల సూదికొండ పరిసర ప్రాంతాల్లో జంట పట్టణాలకు రాబోవు రోజుల్లో నీటికొరత ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సూదికొండలో చుట్టూ చాలామంది నిరుపేదలు నివాస గృహాలు నిర్మించుకుని జీవిస్తున్నారని, కొండ భాగం తవ్వడం వలన కొండ చరియలు విరిగిపడి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. తక్షణమే సూదికొండలో జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో పలాస నియోజకవర్గం ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అంబటి ఆనందరావు, సీపాన శ్రీరాములు, సీపాన అఖిల్, బగాది సింహాచలం, సీపాన లోకేష్, ఆది, దిలీప్, పవన్, దుమ్ము.రాజు, యర్రంనాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న గోపి తదితరులు

యంత్ర సేవా కేంద్రాలు పరిశీలన



మెళియాపుట్టి : మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఎడి మధుబాబు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో 21 రైతు సేవ కేంద్రాలకు ప్రభుత్వం నుంచి రాయితీపైన అందించిన యంత్ర పరికరాలను పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్.వి.మధుబాబు మండల ఎఒ ఎస్.దానకర్ణుడుతో కలిసి శుక్రవారం సందర్శించారు. కోసమాల, వసుందర, దీనబంధుపురం, రామచంద్రపురం వ్యవసాయ యంత్ర సేవా కేంద్రాలను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా సిహెచ్‌సి గ్రూప్ సభ్యులతో మాట్లాడుతూ రైతులకు అవసరమైన యంత్ర పరికరాలను అద్దె ప్రాతిపదికన రైతుల అవసరాల మేరకు అందించాలని తెలియజేశారు. అలాగే రైతులు వ్యవసాయానికి అవసరమైన యంత్ర పరికరాలను అద్దె ప్రాతిపదికన పొందుటకు దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. రైతులు యంత్ర సేవా కేంద్రాల కన్వీనర్ లేదా కో-కన్వీనర్ లేదా గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి వ్యవసాయ యంత్ర పరికరాలను పొందవచ్చునన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు నరేంద్ర, యమున, మనీషా, త్రినాథ్, సిహెచ్‌సి గ్రూపు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: వ్యవసాయ పనిముట్లను రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారని మండల ఎఒ కిరణ్ వాణి అన్నారు. దేవునల్తాడ, సీతాపురం తదితర సచివాలయాల్లో పర్యటించి యంత్రాలను పరిశీలించారు. మండలంలో ఐదవై బృందాలకు ప్రభుత్వం తరుపున యంత్ర పరికరాల అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు జ్యోత్స్న, శివ తదితరులు పాల్గొన్నారు.

వెండి కిరీటం బహూకరణ

ప్రజాశక్తి- కవిటి

ఉద్దానం ఇలవేల్పు చింతామణి అమ్మవారికి పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు బెందాలం చిట్టిబాబు, మంగమ్మ దంపతులు వెండి కిరీటం బహూకరించారించారు. రూ. 1.5 లక్షల విలువైన ఈ వెండి కిరీటాన్ని కుటుంబ సభ్యులు, ఉషోదయ యువజన సంఘం సభ్యుల సమక్షంలో శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఉషోదయ యువజన సంఘం సభ్యులు బెందాలం రమేష్, ఆరింగి మధు, పాండవ చంద్రశేఖర్, తమరాల జయరాం, పొల్లాయి లక్ష్మీమూర్తి, పొల్లాయి ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.



ముర్మును సత్కరిస్తున్న వేణుగోపాల్ తదితరులు

21న మోడల్ స్కూల్ పరీక్ష

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఈనెల 20న జరగాల్సిన ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి నిర్వహించాల్సిన పరీక్ష 21వ తేదీకి మార్పినట్లు రణస్థలం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు హాజరు కావాల్సిన విద్యార్థులంతా ఈనెల 21న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించబడునని ఆన్‌లైన్‌లో అప్లై చేసిన విద్యార్థులంతా హాజరుకావాలని కోరారు.

పొందూరు: మండలంలోని వావిలపల్లిపేట వద్ద గల ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 21న ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకర్ తెలిపారు. ముందుగా ఈనెల 20న ప్రవేశ పరీక్షను అధికారులు ప్రకటించగా, ఆరోజు ఈస్టర్ సందర్భంగా ప్రవేశ పరీక్ష తేదీని మార్చడం జరిగిందని పేర్కొన్నారు.

జీవ ఉత్ప్రేరకాల ద్వారా మేలైన దిగుబడులు



క్షేత్రాలను సందర్శించిన అశోక్ రాజవర్ధన్ తదితరులు

ప్రజాశక్తి- రణస్థలం

నేలలో మొక్కజొన్న పంటకు ఉపయోగపడే సూక్ష్మజీవులను ఉత్తేజపరిచే జీవఉత్ప్రేరకాలు వినియోగించడం ద్వారా మేలైన పంట దిగుబడులు సాధించవచ్చని స్ట్రింగ్ బయో ప్రైవేట్ లిమిటెడ్ తెలుగు రాష్ట్రాల రీజనల్ హెడ్ అశోక్ రాజ్ వర్ధన్ అన్నారు. శుక్రవారం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్, స్ట్రింగ్ బయో ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో అడపాపేటలో నిర్వహిస్తున్న పరిశీలనా క్షేత్రాలను సందర్శించిన ఆయన మాట్లాడుతూ 'సూక్ష్మజీవులను ఉత్తేజపరిచే జీవఉత్ప్రేరకాలను (బయో స్టిమ్యులి) వినియోగించిన రైతుల క్షేత్రాల్లో మొక్కజొన్న కంకుల పరిమాణం, కంకిలో వరుసల సంఖ్య, గింజల సంఖ్య, గింజ నాణ్యతలో గుర్తింపదగ్గ మార్పును గమనించడం జరిగిందన్నారు. ఈ జీవఉత్ప్రేరకాల వినియోగం వలన మొక్కజొన్న పంటలో కిరణజన్య సంయోగ క్రియా సామర్థ్యం పెరగడం వలన గింజల బరువు, నాణ్యతలో గుర్తించదగ్గ మార్పుతో పాటు, రసాయన ఎరువుల ఆదా విషయంలో ప్రతి చోటా రైతుల నుంచి సానుకూల స్పందనను గమనించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు, సమన్వయకర్తలు పి.రమణ, డి.శ్రీనువాసరావు, రైతుమిత్రలు అడపా తిరుపతిరావు, అడపా రమణమూర్తి పాల్గొన్నారు.

సైకిల్ యాత్రికునికి సత్కారం

ప్రజాశక్తి- గుజరాతీపేట

సుప్రసిద్ధ క్రికెటర్ ధోని అభిమాని అయిన 18 ఏళ్ల యువకుడు కోల్‌కత్తా నుంచి చెన్నై వరకు సైకిల్ యాత్ర చేస్తున్నాడు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం హుగ్లీ జిల్లా ఆరామ్ భాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మధుర్‌పూర్ గ్రామానికి చెందిన సౌవిక్ ముర్ము కోల్‌కత్తా నుంచి గత తొమ్మిది రోజులుగా సైకిల్ యాత్ర చేసుకుంటూ జాతీయ రహదారి మీదుగా శుక్రవారం శ్రీకాకుళం చేరుకున్నాడు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, వ్యాపారవేత్త కృష్ణారావు దుశ్శాలువతో ముర్మును సత్కరించి ఆయన ప్రయాణానికి అవసరమైన ఆర్థికసాయం అందించారు. మరో 10 రోజుల పాటు తన ప్రయాణం సాగించి చెన్నైలో ధోనీని కలుసుకోవడమే లక్ష్యమని ముర్ము తెలిపారుజ

రీ సర్వేతో రైతులకు మేలు

ప్రజాశక్తి- పలాస

వ్యవసాయ భూములను ఫేజ్-2లో భాగంగా సర్వే చేస్తున్నామని, రీ సర్వేతో రైతులకు మేలు జరుగుతుందని ఆర్‌డిఒ జి.వెంకటేష్ అన్నారు. మండలంలోని చినంచలలో శుక్రవారం ఫేజ్-2 రీ సర్వేను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాస డివిజన్ పరిధిలో మొదటి ఫేజ్లో ఏడు గ్రామాలను రీ సర్వే చేశామన్నారు. రెండో ఫేజ్‌లో 14 గ్రామాలను ఎంపిక చేసి రీ సర్వే ప్రారంభించామని చెప్పారు. మరో మూడు నెలల్లో డివిజన్ పరిధిలోని 14 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేస్తామన్నారు. వ్యవసాయ భూములకు రీ సర్వే చేయడం ద్వారా రైతులకు ఉపయోగకరమన్నారు. తప్పులు, ఒప్పులు ఉంటే రీ సర్వేలో సరి చేసుకోనేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ వాయిలపల్లి సునంద, మండల సర్వేయర్ గిరి పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

టెక్కలి: ఆర్‌టిసిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎంయు ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన కార్యక్రమం శుక్రవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా స్థానిక డిపో గ్యారేజ్ ముందు ఎన్ఎంయు నాయకులు నినాదాలు చేశారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జిఒ ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు అరికట్టాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థపరంగా వేతనాలు చెల్లించాలని తదితర డిమాండ్ల సాధనకై రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆందోళన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో రీజనల్ జాయింట్ కార్యదర్శి బి.ధనుంజయ్‌రావు, డిపో అధ్యక్షులు పి.రమణమూర్తి, కె.సూరిబాబు, ఎంఎస్ చలం, రామారావు, రమేష్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



టెక్కలి : డిపో ఎదుట ఆందోళన చేస్తున్న ఆర్‌టిసి కార్మికులు

పలాస: ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద రెండో రోజు ఉద్యోగులు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.వాలి, డివిఎల్ నారాయణ, ఎవి రావు, టిడి రావు, టి.పార్వతీశం, ఎన్.నారాయణ, వై.అప్పయ్య, హెచ్.వి మూర్తి, డి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- కవిటి

మండలం పెద్ద కపాసుకుద్ది గ్రామంలో విద్యార్థులు పదో తరగతి వరకూ చదువుకునే అవకాశం కల్పిస్తూ, ప్రస్తుతం ఉన్న పాఠశాల ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ గ్రామంలోని పాఠశాలలో 301 మంది విద్యార్థులు చదువుతుంటే, గ్రామం నుంచి బయట ఉన్న ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలకు 500 మంది విద్యార్థులు చదువు కోసం వెళ్తున్నట్లు తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని తక్షణమే తమ గ్రామంలో ఉన్నత పాఠశాలకు అనుమతులు ఇవ్వాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎంఇఒ ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో దేవరాజు, తిరుపతి, కోడ దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల విత్తన ప్రదర్శన

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని చేపేనపేట యూనిట్‌లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతుల సమక్షంలో నవధాన్య విత్తనాలను ప్రదర్శించారు. క్షేత్రస్థాయిలో రైతులకు నవధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. అలాగే ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సొంత క్షేత్రాల్లో 25 కేజీల నవధాన్య విత్తనాలను వేయిస్తున్నామని తెలిపారు. నవధాన్య సాగును ఒక ఉద్యమంగా రైతులతో చేయిస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయ సాగుతో పంటలకు చీడపీడలు దరి చేరవని, దిగుబడి సాధ్యపడుతుందని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.



విత్తన ప్రదర్శనను నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఘనంగా కస్తూరిబా గాంధీ జయంతి



నివాళ్లర్పిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- కవిటి

కస్తూరిబా గాంధీ జయంతి వేడుకలు కొత్తపాలెం కెజిబివిలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కస్తూరిబా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ లక్ష్మీ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో కస్తూరిబా గాంధీ పాత్ర, గాంధీజీ విదేశీ విద్యాభ్యాసంలో ఆమె త్యాగం వంటి విషయాలు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు వంద మంది హాజరు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్పవర్ కంపెనీ లిమిటెడ్ (టొమ్కామ్) నిర్వహించిన జాబ్‌మేళాలో వంద మంది నిరుద్యోగులు హాజరయ్యారని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. వీరిలో 30 మందిని ఎంపికి చేసి అవసరమైన తర్ఫీదును ఇచ్చి పలు దేశాల్లో ఉద్యోగాల నియామక ఏర్పాటును చేస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో ఆ కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ శ్రావణి తలశిల హాజరయ్యారని డైరెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రణాళికతో, ఒక లక్ష్యంతో విద్యాభ్యాసం చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్ఒడి డాక్టర్ వి.అశోక్ కుమార్, కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.వి.ఎల్. భవాణీ, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రావణి

త్వరితగతిన సర్వేల పూర్తి

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పలు రకాల సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని, ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు ఉంటాయని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు సచివాలయ ఉద్యోగులకు హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సచివాలయ ఉద్యోగులతో హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వే, వర్క్ ఫ్రం హోం సర్వే, చిల్డ్రన్ విత్ ఆధార్ సర్వే, డెత్ ఆడిట్ రీవెరిఫికేషన్ సర్వే, పిజిఆర్ ఎస్ థంబ్, ఐకెవైసి ప్రగతి తదితర యాప్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ యాప్‌ల సర్వేపై జిల్లా కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారని, ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేసి సర్వే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కార్యాలయ మేనేజర్ ప్రభాకరరావు, 16 సచివాలయాల నోడల్ అధికారులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.